www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 6 ఆగస్టు 2023

5

పశ్చిమ గోదావరి



ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం టౌన్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. లక్ష్మణేశ్వరం, మంగళగుంటపాలెం అర్బన్‌లోని జగనన్నకాలనీ లేఅవుట్‌లను శనివారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా చేపట్టాలనితెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 250 ఎకరాల భూమిని సుమారు 10,800 మంది లబ్ధిదారులకు సేకరించామని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 60 శాతం లేఅవుట్లలో చురుగ్గా పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జి.రాధాకృష్ణ, వైస్ ఎంపిపి యు.రమేష్‌నాయుడు, తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు



ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొన్న జెడ్‌పి ఛైర్మన్, రెండు జిల్లాల కలెక్టర్లు

'పోలవరం నిర్వాసితుల సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల గళం

డ్రెయినేజీ, తాగునీరు, ఉపాధి, భూమికిభూమి వంటి సమస్యలెన్నో అంటూ ఆవేదన

వేలేరుపాడు ఆసుపత్రిలో సదుపాయాల్లేక గర్భిణుల అవస్థలు

ఉమ్మడి జిల్లా జెడ్‌పి సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు

వ్యవసాయం, విద్య, ఇరిగేషన్, ఇళ్ల నిర్మాణం వంటి సమస్యలపై ఏకరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులను తరలించిన జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, ఉపాధి లేక, భూమికి భూమి ఇవ్వక అక్కడికి చేరిన నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఆయా ప్రాంతాలకు చెందిన జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు ఉమ్మడి జిల్లాపరిషత్ సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు హాలులో శనివారం జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పోలవరం మండలానికి చెందిన జెడ్‌పిటిసి, ఎంపిపి, వేలేరుపాడు మండలానికి చెందిన ఎంపిపి, జెడ్‌పిటిసిలు పోలవరం నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని సమస్యలపై గళమెత్తారు. పోలవరం మండలానికి చెందిన శివగిరి, కొరుటూరు నిర్వాసితులను తరలించిన కాలనీలో కనీస వసతులు లేవన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చేరిన నిర్వాసితుల సమస్యలపై జిల్లాకలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మండలకేంద్ర పోలవరంలో నిర్మిస్తున్న ఆసుపత్రి పూర్తికాలేదన్నారు. పోలవరం నియోజకవర్గంలో ఇళ్లనిర్మాణాలకు అవకాశం లేకుండా చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వేలేరుపాడులో ఉన్న ఆసుపత్రిలో సరైన ఆసుపత్రిలేక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల ఓ గర్భిణి ఉదయం నుంచి రాత్రి వరకూ నొప్పులతో బాధపడుతూనే ఉందన్నారు. ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలని కోరారు. ఏజెన్సీలో రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్లు వేయాలన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం ఇవ్వకపోవడం తీవ్ర సమస్యగా ఉందన్నారు. అధికారులు జెడ్‌పిటిసి సభ్యులను కనీసం పట్టించుకోవడం లేదని తెలిపారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానం ఇస్తూ ఐటిడిఎ పిఒ బాధ్యతలు తీసుకున్నారని, కొద్దిరోజుల్లో నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. లేవనెత్తిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. నాడు - నేడు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించిన బకాయిలు, ఇళ్ల నిర్మాణాల పెండింగ్ బకాయిలు, జలకళ, రోడ్లు, ఇరిగేషన్, వ్యవసాయం, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు.

పనుల్లో జెడ్‌పిటిసి సభ్యులకు ప్రాధాన్యత : జెడ్‌పి ఛైర్‌పర్సన్

జిల్లా పరిషత్ నిధులతో మండల పరిధిలో చేపట్టే పనుల్లో జెడ్‌పిటిసి సభ్యుల సూచనలకు ప్రాధాన్యతిస్తామని జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జెడ్‌పిటిసి సభ్యులు తమ పరిధిలోని గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటికి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారుల ద్వారా చర్యలు తీసుకున్నారు. పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంతో జిల్లా పరిషత్ ద్వారా వివిధ అభివద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతీ ఇంటికి జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి కుళాయి కనెక్షన్లు అందిస్తున్నామన్నారు. సత్యసాయి తాగునీటి పథకం ద్వారా జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లోని 151 గ్రామాల ప్రజలకు తాగునీరు అందించామన్నారు. నవరత్నాల్లో భాగంగా గృహ నిర్మాణ పథకాన్ని పూర్తిగా అమలు చేసి రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాల్లో పూర్తి పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చూడాలని, దోమల నిర్మలన చర్యలు చేపట్టాలన్నారు. వరదల కారణంగా పాడైన రోడ్లకు మరమత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతిచ్చి అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాధరాజు మాట్లాడుతూ ఇటీవల వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని, వరద బాధితులకు అండగా నిలిచి, వారికి అసౌకర్యం కలగకుండా వరద సహాయక చర్యలు చేశారన్నారు. జిల్లా పరిషత్ ద్వారా నిధుల కేటాయింపును అన్ని మండలాలకు సమానంగా కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పోలవరం నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్‌కాలనీల్లో పారిశుధ్యం, తాగునీరు వంటివి వాటికి జెడ్‌పి నిధులు కేటాయించాలన్నారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎంపిటిసిలకు గౌరవ వేతనం పెంచాలని కోరారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని కోరారు. తణుకు, పెరవలి మండలాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ సబ్ స్టేషన్‌లు నిర్మించాలని కోరారు. పెరవలి మండలం మల్లేశ్వరంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు దాతలు స్థలం అందించారని, ఆ ప్రదేశంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ నంబూరి తేజ్ భరత్, ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొల్లేరులో లైడార్ విధానంలో భూసర్వే

కొల్లేరు కాంటూరు పరిధిలో లైడార్ విధానం ద్వారా భూముల రీ సర్వే చేస్తున్నట్లు ఏలూరు జిల్లాకలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కార్యక్రమంలో చేపట్టిన నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బందాలు పనుల నాణ్యతను పరిశీలిస్తాయన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీల్లో విద్య, వైద్యానికి సంబంధించిన సదుపాయాలతోపాటు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఇళ్ల వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సి

పంచాయతీ రాజ్‌లో సుమారు 470 మంది అటెండర్లు, స్వీపర్లు, ట్యాంక్ వాచ్‌మెన్, తదితర ఉద్యోగులకు 2010 నుండి పిఆర్‌సిలు వర్తింప చేయలేదని, 20 నెలల డిఎ ఇవ్వలేదన్నారు. ఆ బకాయిలు చెల్లించాలని కోరారు. హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన ప్లస్2 విద్యకు సంబంధించి బోధనా సిబ్బందిని నియమించినట్లు వివరాలిచ్చారని, విద్యార్థుల సంఖ్య మాత్రం తక్కువగా ఉందన్నారు. ప్లస్ టు విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని సిపిఎం పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం సిపిఎం బృందం జగనన్న కాలనీల్లో, టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో పర్యటించింది. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, బిల్లులు వెంటనే ఇవ్వాలని, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతనం సిపిఎం బృందం సభ్యులు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నేటికీ ఎలాంటి సౌకర్యాలూ లేకపోవడంతో నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయన్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మించుకుని ఉన్న వారు తాగునీరు, డ్రెయినేజీ, విద్యుత్ తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న వస్తువులకు రక్షణ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, కరెంటు తదితర సమస్యలు 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు సామగ్రి పోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎ.అజయకుమారి, గార రంగారావు, ఎం.గోవిందరాజు, రమేష్ పాల్గొన్నారు.



అయోధ్యలంకలో వరదకు పాడైన పంటలను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు

అయోధ్యలంకలో సిపిఎం రాష్ట్ర కమిటీ బృందం పర్యటన

ప్రజాశక్తి - ఆచంట

ఇటీవల గోదావరి వరదల కారణంగా నష్టపోయిన లంక గ్రామ రైతులకు యుద్ధ ప్రతిపాదికన నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం మండలం అయోధ్యలంక గ్రామంలో సిపిఎం రాష్ట్ర కమిటీ బృందం సభ్యులు ముంపున గురైన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల సంభవించిన గోదావరి వరదల్లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో అరటి, కొబ్బరి, మునగ, తమలపాకు, బీర, బెండ, చిక్కుడు, పచ్చిమిర్చి తోపాటు పలు రకాల ఆకు కూరల పంటలు కూడా పూర్తిగా నీట మునిగి నష్టపోయారన్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారని, కోతకొచ్చే సమయంలో గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద తగ్గిన తర్వాత కూడా లంక భూముల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో అదనంగా మరో రూ.25 వేల వరకూ పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని రైతులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ప్రభుత్వం లంకగ్రామాల రైతులను ఆదుకోకపోతే అప్పుల ఊబిలోకి కూరుకుపోతారని, తక్షణం యుద్ధ ప్రతిపాదికన నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యనారాయణ, కె.హరిబాబు, మాల్యాద్రి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, అయోధ్యలంక శాఖ కార్యదర్శి దాసరి రమేష్, నాయకులు దాసరి బాలయ్య, సరేళ్ల రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గృహ నిర్మాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 72,059 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా కాగా 25,383 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లు కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో హౌసింగ్, రెవెన్యూ, పిఆర్‌అండ్‌ఆర్‌డి, స్వమిత్వ, జాతీయ చేనేత దినోత్సవం, వ్యవసాయం, పశుసంరక్షణ, డెయిరీ డెవలప్‌మెంట్, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు సంబంధించి ఈ ఏడాది మే 9వ తేదీ నుంచి అందిన 6,346 అర్జీల్లో 4,844 పరిష్కరించామని తెలిపారు. వాటిలో 1,041 పరిష్కార దశలో ఉన్నాయని, 437 రీఓపెన్ అయ్యాయని తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కింద గ్రామ, వార్డు, మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయిలో 4 దశల్లో చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను అక్టోబర్ 2 నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నామని, నిర్మాణాలు పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులచే ప్రారంభిస్తామని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

దళిత సమస్యలపై 'ప్రత్యేక స్పందన'ను పున : ప్రారంభించాలి

కెవిపిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో దళిత సమస్యలపై ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని పున్నప్రారంభించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో దళితులు ఎదుర్కొనే ప్రతి సమస్యపై కెవిపిఎస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. జిల్లా విభజన అయ్యాక దళితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని అధికారులు చెప్పారన్నారు. గతంలో దళిత సమస్యలపై ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, ఆ కార్యక్రమాన్ని కొనసాగించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రతి సోమవారమూ జరిగే స్పందన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా దళితులు వారి సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెలాఖరున జరిగే సివిల్ రైట్స్ డే కార్యక్రమం అన్ని మండలాల్లో తూతూమంత్రంగా జరుగుతోందని విమర్శించారు. కులవివక్ష, అంటరానితనం వంటి అంశాలపై చర్చ జరపాల్సిన అధికారులు కేవలం దళితులను మాత్రమే పిలిచి సంక్షేమ పథకాల కోసం వివరించి సమావేశాన్ని ముగించడం దారుణం అన్నారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో 70 శాతం దళితపేటల్లో పూర్తిస్థాయిలో శ్మశానవాటికలు లేవని తెలిపారు. వర్షాకాలం వల్ల దళితపేటలో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి దళితపేటలో శానిటేషన్ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు చిన్నం చిన్న నాగేశ్వరరావు, కానేటి బాలరాజు, మాదాసి గోపి, జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, మువ్వల రాజారావు, పి.శ్యాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిస్ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - తణుకురూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించి రెండు నెలలైనా నేటికీ సుమారు 60 వేల మందికి జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ విమర్శించారు. శనివారం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జిఒ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలని, 11వ పిఆర్‌సి బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.వీరభద్రరావు, పెద్దిరాజు, అంజబాబు, రామప్రసాద్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: ఇటీవల బదిలీలైన ఉపాధ్యాయ్యులకు రెండు నెలలుగా జీతాలందక వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి జీతాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ మండల శాఖ డిమాండ్ చేసింది. ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ దండు అశోక్ వర్మకు నేతలు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పిఎన్‌వి.ప్రసాద్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్‌వి.సత్యనారాయణ, మండల అధ్యక్షులు సిహెచ్‌వి.నరేంద్ర, ప్రధానకార్యదర్శి కండిబోయిన రాంబాబు పాల్గొన్నారు.

పెనుగొండ : బదిలీలు, ఉద్యోగోన్నతి పొందిన ఉపాధాయులకు రెండు నెలలుగా జీతాలివ్వక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వారికి జీతాలివ్వాలని ఎపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పి.జనార్ధనస్వామి, జిల్లా కౌన్సిలర్లు బి.రాజారావు, ఎ.సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షులు రాఘవులు, ప్రధాన కార్యదర్శి పోతురాజు పాల్గొన్నారు.



తణుకు : తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

అన్నీ తెలిసినా.. ఎందుకింత అలసత్వం..!

'గోదావరి వరదలు పూర్తిగా తగ్గి పూర్వస్థితి వచ్చే వరకూ పునరావాస కేంద్రాలు కొనసాగించండి.. ప్రతి వరద బాధితునికీ ప్రభుత్వసాయం కచ్చితంగా అందించండి.. మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరినీ ఆదుకోండి' ఇదీ జిల్లా కలెక్టర్లకు సిఎం జగన్ చేసిన దిశానిర్దేశం.. సిఎం మాటలు విని వరద బాధితులకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తుందనుకుంటే పప్పులో కాలేసినట్లేనని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు పెదవివిరుస్తున్నారు. అసలు ముంపు సమస్యను సృష్టించిందే ఈ పాలకులని, మళ్లీ ఆ సమస్య వల్ల బాధపడుతున్న తమను ఆదుకోకపోగా మొసలి కన్నీరు కార్చడం ఏమిటో తమకు అర్థం కావడం లేదని పోలవరం నిర్వాసితులు తలలు పట్టుకుంటున్నారు.

సుమారు పది రోజులపాటు వణికించిన గోదావరి వరద తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఈసారి వరద ఉధృతి తక్కువగానే ఉన్నా నష్టం మాత్రం అదే విధంగా ఉందని ముంపు మండలాల ప్రజలు వాపోతున్నారు. గతంలో మాదిరి ఇళ్లను వదిలి కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు, సమీపంలోని కొండలు, గుట్టలపైకి తరలివెళ్లి తలదాచుకున్న సంఘటనలు మళ్లీ మన ముందు సాక్షాత్కరించాయి. గతేడాది వరదలకు నష్టపోయి ఇప్పటికీ పరిహారం అందక, ఆ సందర్భంగా సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు కాక తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రజలకు ఈ వరదలు గోరుచుట్టుపై రోకలి పోటులా పరిణమించాయి. దీంతో బాధితుల పరామర్శకు వెళ్లిన పోలవరం ఎంఎల్ఎ బాలరాజును రెండుసార్లు నిర్వాసితులు నిలదీశారు. 'ముంపు తీసుకొచ్చిందే మీరు.. ఆ ముంపు నుంచి మమ్మల్ని బయటపడేసేలా పునరావాస పరిహారం, ప్యాకేజీ ఇస్తే తామే వెళ్లిపోతాం.. అంతేగాని ప్రతియేటా గోదావరి వరదలకు వచ్చి తమ కష్టాలు చూసి మొసలి కన్నీరు కార్చాల్సిన అవసరం లేదు' అంటూ కుండబద్దలు కొట్టినట్లు తేల్చిచెప్పారు. వరదల సందర్భంగా ఇస్తామన్న నష్టపరిహారం ఏమైందని నిలదీశారు. తమకు ఆ నష్టపరిహారం ఇచ్చినా.. ఇవ్వకపోయినా పునరావాస పరిహారం, ప్యాకేజీ ఇస్తే వెంటనే పునరావాస కాలనీలకు వెళ్లిపోతామని, అంతేగాని పొమ్మనలేక పొగబెట్టినట్లు ప్రతియేటా తమను ముంచుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని, వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని గోదాట్లో ముంచుతామని హెచ్చరించారు. దీంతో ఖంగుతిన్న ఎంఎల్ఎ బాలరాజు ఈ సమస్యలేవీ తన దృష్టిలో ఇప్పటి వరకూ లేనట్లు ప్రజల ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రకటించి అక్కడి నుంచి జారుకున్నారు. ప్రభుత్వ ఉదార ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో ఆచరణకు ఏమాత్రమూ పొంతన లేదనేది వాస్తవం. దీనికితోడు ఇటీవల పోలవరం పోరుకేక పేరిట సిపిఎం నిర్వహించిన పాదయాత్ర నిర్వాసితుల్లో ఆలోచన రేకెత్తించిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అందుకే ప్రభుత్వ పెద్దల జాలి మాటలు.. అధికారుల ఊరడింపులకు తలొగ్గకుండా నిలదీసే పని ప్రారంభించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు సంబంధించిన పరిహారం, ప్యాకేజీకి సంబంధించిన నిధులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయకపోతే నిర్వాసితుల ఆగ్రహానికి గురయ్యేది మొదట రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వమేనని ఆ ప్రభుత్వ పెద్దలు గుర్తించడం మంచిదని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికితోడు కాంటూరు లెక్కల్లో లోపాలు, లైడార్ సర్వేలో తప్పిదాలను సవరించి 1986లో వచ్చిన వరదలు, 2022లో వచ్చిన వరదల ముంపు ఆధారంగా మండలం యూనిట్‌గా ప్రాజెక్టు ముంపును గుర్తిస్తే చాలావరకూ సమస్యలు పరిష్కారమవుతాయని, ఆపై వారికి పరిహారం, ప్యాకేజీ ఇస్తే నిర్వాసితులకు న్యాయం చేసినట్లని చెబుతున్నారు. ఇక వరదలకు సంబంధించి పంట నష్టం ఊసు పెద్దగా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు సైతం ఎత్తడం లేదు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, యలమంచిలి మండలాల్లో కూరగాయ పంటలతోపాటు తమలపాకు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం కొలమానాలు మాని క్షేత్రస్థాయిలో నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు. అలాగే గతంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా గోదావరిపై వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేగాని అన్నీ తెలిసినా ఏమీ పట్టనట్లు తూతూమంత్రంగా పర్యటనలు చేసి అరకొరగా నష్టపరిహారం విదిల్చితే ఏమీ ఉపయోగం ఉండదని, ప్రభుత్వం అలసత్వం వీడి వరద బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటేనే వచ్చే ఎన్నికల్లో అధికారపక్షానికి నష్టం వాటిల్లకుండా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరి ప్రభుత్వం ఎప్పట్లానే మాటలు, ప్రకటనలతోనే కాలక్షేపం చేస్తుందో.. మాటల్లోని మానవతా దృక్పథాన్ని చేతల్లో చూపించి ప్రజల పక్షం వహిస్తుందో వేచిచూడాలి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్



9న మహాధర్నాను జయప్రదం చేయాలి

సిఐటియు పట్టణ కార్యదర్శి వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన భీమవరంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని, కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు పట్టణ అధ్యక్షులు సింహాద్రి సిరిష్ అధ్యక్షతన సిఐటియు విస్తృతస్థాయి సమావేశం సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. కిట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోడీని గద్దె దింపే వరకూ పోరాడాలన్నారు. కార్మికుల సమస్యలేవీ తొమ్మిదేళ్ల మోడీ పాలనలో పరిష్కారం కాలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్న డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. స్కీం వర్కర్ల శ్రమను దోచుకోవడం తప్ప వారిని పర్మినెంట్ చేయడం లేదని, కీలక రంగాలతో సహా ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తామని మోడీ ప్రభుత్వం ప్రకటించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించిందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. కొత్త పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, కనీసం పిఎఫ్ పెన్షన్ తొమ్మిది వేలకు పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఎ.శ్రీనివాసరావు, బంగారు వరలక్ష్మి, నీలాపురాజు, కె.వెంకటేశ్వరరావు, కె.సత్య నారాయణ, డి.నాగు, డి.బాబూరావు, పిన్నింటి శ్రీనివాస్, రాంబాబు, బి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేడు అమృత్ భారత్ స్టేషన్-23 ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్-23 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైల్వే డివిజన్ పర్యవేక్షకులు డిఇఎన్ ఈస్ట్ విజయవాడ కె.శ్రీధర్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ -23 పథక బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ ఈ నెల ఆరో తేదీన ప్రారంభించనున్నట్లు చెప్పారు. భీమవరం టౌన్ స్టేషన్‌లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రతి స్టేషన్‌లో అభివృద్ధి కోసం రూ.కోట్లు విడుదల చేస్తుందని, మన డివిజన్‌లో భీమవరం, నరసాపురం స్టేషన్లు ఎంపికయ్యాయని తెలిపారు. చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, జనపాటి మధుసూదనరావు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ భీమవరం టౌన్ స్టేషన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలన్నారు. ఎపిఇ విజయవాడ కె.శ్రీనివాసరావు కార్యక్రమ ప్రణాళికను వివరించారు. భీమవరం ఎడిఇఎన్ ఎ శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బి.సాంబశివరావు, సివ ప్రసాద్, జెఇ డి మధుసూదనరెడ్డి, బి.ప్రసాద్ పాల్గొన్నారు.


అప్పారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పితాని సత్యనారాయణ

అప్పారావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సర్పంచిగా చుక్కా అప్పారావు ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. చుక్కా అప్పారావు కుటుంబసభ్యులను మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ శనివారం పరామర్శించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్పారావు భార్య సుభాషిని, కుమారుడు లోకేష్, కుమార్తె గీత, అల్లుడు రామకృష్ణ, తమ్ముళ్లు శ్రీనివాస్, రమేష్‌లను ఓదార్చి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో సాయం కావాలంటే తానున్నానని ధైర్యం చెప్పారు. పార్టీకి అప్పారావు సేవలు మరువలేనివన్నారు. మార్టేరు పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ కర్రి అచ్యుత రామరెడ్డి, సత్యవరం, కోయేటిపాలెం మాజీ ఎంపిటిసి సభ్యులు కర్రి ఈశ్వర్ వెంకట్ రెడ్డి, సత్తి బామిరెడ్డి, మునిబాబు, కీర్తి చైతన్య, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ట్రిపుల్ ఐటికి ఎంపికైన హైస్కూల్ విద్యార్థులకు నగదు బహుమతి అందించే కార్యక్రమాన్ని శ్రీవివేకానంద ఆధ్వర్యంలో స్థానిక పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.సుధారాణి మాట్లాడుతూ ప్రతి ఏడాది పదో తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్ ఐటికి ఎంపికవుతున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలోని ఐదుగురు విద్యార్థులు కె.కీర్తి, టి.మేఘన, డి.నందిని, వై.దీపిక, కె.కృష్ణప్రియ, జెపిలెల్ హైస్కూల్ నుంచి ఎం.రమాదేవి రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్‌కు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి దాతలు గంటా త్రిమూర్తులు రూ.ఆరు వేల సహాయం అందించారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ విద్యార్థులకు కొన్ని అవసరాలు ఆర్థికంగా ఉన్నాయని, దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, యలమంచిలి శ్రీనివాస్, టి.ఆనంద్, వారణాసి రాధాకృష్ణ పాల్గొన్నారు.

'డిఎన్ఆర్'లో గ్రీన్‌హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రీన్ హౌస్‌ను శనివారం ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రభుత్వ అసిస్టెంట్ సెక్రటరీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ లక్ష్మి అలివేలు కుటుంబ సమేతంగా కళాశాలను శనివారం సందర్శించారు. గతంలో ఆమె ఇచ్చిన రూ.లక్ష విరాళంతో కళాశాలలో నిర్మించిన గ్రీన్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, కార్యదర్శి సభ్యులు డాక్టర్ వర్మ, శ్రీకాకుళం మైథిలీ వృక్షశాస్త్ర అధ్యాపకులు శిరీష, ఎన్ఎస్ఎస్ పిఒ నోబుల్ రాజ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు మహాలక్ష్మి

సంతాపసభలో వక్తలు

ప్రజాశక్తి - యలమంచిలి

సిపిఎం సీనియర్ నాయకురాలు, చించినాడ మహిళా పోరాట యోధురాలు మహాలక్ష్మి ఆదర్శప్రాయురాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. ఇటీవల మృతి చెందిన మహాలక్ష్మి సంతాప సభను చించినాడలోని ఆమె స్వగృహం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షత వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కవురు పెద్దిరాజు మాట్లాడుతూ సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలను మహాలక్ష్మి ఎదిరించి నిస్వార్థంగా పోరాటం చేసిందన్నారు. 1977-80 మధ్యకాలంలో చించినాడ గ్రామంలో పెత్తందారులకు వ్యతిరేకంగా జరిగిన మహా పోరాటంలో గ్రామానికి చెందిన ఇతర మహిళలతో కలిసి చురుకైన పాత్ర పోషించి గ్రామాన్ని రక్షించుకున్నారన్నారు. అటువంటి మహాలక్ష్మి వంటి పోరాట పటిమను ఇప్పటి కార్యకర్తలు ముందుకు తీసుకువెళ్లడమే ఆమెకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు కేత సూర్యారావు మాట్లాడుతూ మహాలక్ష్మి మొదటి నుంచి సిపిఎంలో ఒక క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పని చేసేవారన్నారు. ముందుగా మహాలక్ష్మి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, సీనియర్ నాయకులు మావూరు సుబ్బారావు, ఐద్వా నాయకులు సరస్వతి జయప్రభ, ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి సుగుణ, జిల్లెల్ల ప్రశాంతి, స్థానిక నాయకులు వర్ధినీడు, అంజనేయులు, భాస్కరరావు, వెంకటేశ్వరరావు లూథర్ బాబు, జైసింగ్, ప్రియాంక, నాగమణి, జయశ్రీ, స్టాలిన్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై ఆర్‌ఐ పోతురాజు అన్నారు. అత్తిలి నుంచి పెనుగొండ వైపు ఆటోలో తరలిస్తున్న పది క్వింటాల పిడిఎస్ బియ్యాన్ని బ్రాహ్మణ గూడెం వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఆటో స్వాధీనం చేసుకుని వ్యక్తిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బియ్యాన్ని సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించినట్టు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు


ప్రజాశక్తి - ఉండి

కట్నం తీసుకురావాలంటూ భార్యను వేధిస్తున్న భర్త, అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోలమూరు గ్రామానికి చెందిన నంబూరి రామభద్రరాజుకు అదే గ్రామానికి చెందిన సత్యవతితో 2016లో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం ఇవ్వకపోవడంతో కొంతకాలంగా కట్నం తీసుకురావాలని భర్త రామభద్రరాజు, అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. వేధింపులు తాళలేక శనివారం భర్త, అత్తమామలపై నంబూరి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ ఆర్.గంగాధరరావు గృహ హింస కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోరాట యోధుడు వెంకట సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

అనేక ఉద్యమాల్లో మంతెన వెంకట సూర్యనారాయణరాజు అలుపెరుగని పోరాటం సాగించారు. ఉద్యోగ విరమణ అనంతరం పశ్చిమగోదావరి జిల్లాలో తన సహచర రైతు నాయకులతో కలిసి రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర రైతు కార్యచరణ సమితిని స్థాపించడంలో వ్యవస్థాపక సభ్యునిగా కీలక పాత్ర వహించారు. జిల్లా స్థాయిలో రైతు సంఘాన్ని స్థాపించి నీటి తీరువా పెంపు, విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసనగా ఉద్యమాలు చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర సాధన కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు చేశారు. రాజకీయాలకు అతీతంగా స్వతంత్ర రైతు ఉద్యమాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో ఇతర జిల్లాలో ఉన్న రైతు సంఘాలతో కలిసి రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య ఏర్పాటు చేశారు. గోదావరి బేసిన్‌లో గత 20 సంవత్సరాలుగా భూగర్భం నుంచి చమురు సహజ వాయువు వెలికి తీయడంతో భూమి కుంగిపోయే ప్రమాదం ఉందని భూగర్భ శాస్త్రవేత్తల హెచ్చరికలతో ఏర్పడిన కృష్ణా, గోదావరి పరిరక్షణ సమితిలో సమన్వయకర్తగా, అధికార ప్రతినిధిగా చురుకైన పాత్ర పోషిస్తూ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర హైకోర్టు కూడా ప్రజా ప్రయోజనాల పిటిషన్ దాఖలు చేయించి న్యాయపోరాటం చేశారు. కాళ్ల మండలంలో వినియోగదారుల సంఘాన్ని స్థాపించి వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం జరిగిన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అపర భగీరథుడు సర్ అర్థర్ కాటన్ ద్విశత జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు 2003లో రాష్ట్ర స్థాయిలో ఏర్పడిన కమిటీకి కార్యదర్శిగా ఉండి ఉత్సవాలను జయప్రదంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొల్లేరు అభయారణ్యం పరిరక్షణ కోసం ఏర్పడిన కొల్లేరు పరిరక్షణ సమితిలో సభ్యుడిగా కొనసాగుతూ నిరంతరం కృషి చేశారు. రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ వారి సూచన మేరకు ఇతర జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసేందుకు రాష్ట్ర రైతుసంఘాల ఉపాధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్‌తో కలిసి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో రైతు సదస్సులు నిర్వహించి, రైతులకు వివరించడంలో సూర్యనారాయణరాజు ముఖ్య పాత్ర వహించారు. 2003లో రాయలసీమలో కరువు ఏర్పడిన పరిస్థితుల్లో పశువులకు పశుగ్రాసం లేక రైతులు పశువులను అమ్ముకునే స్థితిని దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రైతు కార్యాచరణ సమితి రైతుల నుంచి పశుగ్రాసమైన గడ్డిని సేకరించి ఐదు ర్యాకులను (ఒక్కొక్కటి 40 రైల్వే వ్యాగన్స్) జిల్లా అధికారుల సహకారంతో పంపించారు. భారతదేశంలోని వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న పరపతి విధానం రైతులకు ఇచ్చే రాయితీలపై ప్రపంచ బ్యాంకు అమలు చేస్తున్న విధానాలు రైతులకు నేరుగా చేరడం లేదని, రైతులకు లబ్ధి చేకూరడం లేదనే విషయాలను భారతదేశంలో ఉన్న ప్రపంచ బ్యాంకు కంట్రీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు


సూర్యనారాయణరాజు (ఫైల్)

ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి దానికి ప్రపంచ బ్యాంక్ కంట్రీ డైరెక్టర్‌ను ఆహ్వానించి ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లడంలో సూర్యనారాయణరాజు విశేష కృషి చేశారు. రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ ఛార్జీలు పెంచిన సందర్భంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిరసనగా జరిగిన మహా ఉద్యమంలో కాల్దారి రైల్వే స్టేషన్‌లో అన్యాయంగా జరిగిన పోలీసుల కాల్పుల్లో ఇద్దరు రైతులు బలయ్యారు. రైతులకు జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాదులోని గాంధీభవన్‌లో నిర్వహించిన సంతాప సభలో పాల్గొని పరిహారాన్ని ఇప్పించడంలో ఆయన సఫలీకృతమయ్యారు. పోలవరం ప్రాజెక్టు సాధన సమితి ఛైర్మన్‌గా, అధికార ప్రతినిధిగా, కొల్లేరు సరస్సు అభివృద్ధి కమిటీ అధికార ప్రతినిధిగా, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి అధికార ప్రతినిధిగా ఉన్నప్పుడు రాజ్యసభ మాజీ సభ్యుడు కీర్తిశేషులు మెంటే పద్మనాభంతో కలిసి ఉద్యమించారు.



ఏలూరుపాడుకు అందించే వాటర్‌ట్యాంకు

నేడు ఏలూరుపాడులో వర్ధంతి సభ

స్వాతంత్ర్య సమరయోధుడు మంతెన వెంకట సూర్యనారాయణరాజు ప్రథమ వర్ధంతి సభ ఏలూరుపాడులోని స్వగృహంలో ఈ నెల ఆరో తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి కోశాధికారి మంతెన వెంకట రవివర్మ శనివారం తెలిపారు. ఈ సభకు రాష్ట్ర వ్యవసాయ మండలి వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి, ఎంఎల్ఎ మంతెన రామరాజు, కైకలూరు ఎంఎల్ఎ డి.నాగేశ్వరరావు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, పలువురు ప్రముఖులు, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి సభ్యులు విచ్చేస్తారని చెప్పారు. మంతెన వెంకట సూర్యనారాయణరాజు-సుభద్రయ్య ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫౌండేషన్ ద్వారా జువ్వలపాలెంలో వెయ్యి పూల, పండ్ల మొక్కలను పంపిణీ చేశామన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి రూ.70 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్లను బహుకరించామన్నారు. ఏలూరుపాడు గ్రామానికి ఒక మంచి నీటి ట్యాంకర్‌ను, కలిదిండి మండలం నరసింహపురం గ్రామానికి మరో మంచినీటి ట్యాంకర్‌ను అందించామన్నారు. ఆదివారం రూ.3వేల లీటర్ల కొత్త మంచినీటి ట్యాంకర్‌ను ఏలూరుపాడు గ్రామ ప్రజలకు అందిస్తామన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ ధ్యేయమని యండగండి సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం పంపిణీ చేశారు. యండగండిలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, తద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణపోషణను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ సహ ఉపాధ్యక్షురాలు దత్తాల సుజాతరాణి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం, సూపర్‌వైజర్ నిర్మల, ఎఎన్ఎం రామలక్ష్మి, అంగన్‌వాడీలు మానుకొండ మరియమ్మ, చాపల ఎలీషా, రామలక్ష్మి, రాణి, ఆశాలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని ఆగర్రులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం (చిట్టివాని గరువు)లో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం గ్రామ సర్పంచి కొయ్యే గంగారత్నం, డాక్టర్ ఎస్.లీనాసుప్రియ అందించారు. గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్, ఎంపిటిసి సభ్యులు పెద్దిరాజు, ఆరోగ్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

మండలంలోని ఉల్లంపర్రులోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్ రావాడ సతీష్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమన్నారు. బాలింతలకు, గర్భిణులకు పది రకాల పోషకాలు కలిగిన సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం భాగ్యలక్ష్మి, దివ్యభారతి, అంగన్ వాడీ టీచర్స్ నాగలక్ష్మి, సురేఖ, భాగ్యలక్ష్మి, చంద్రకాంత, కాటంరెడ్డి రామారావు, గూడూరి త్రిమూర్తులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎ.వెంకటలక్ష్మి అన్నారు. పెనుమంట్ర పెద్ద చెరువుగట్టు వద్ద ఉన్న కోడ్ నెంబర్-5 సెంటర్‌లో గ్రామస్థాయి తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలగల షామంత్ సత్య శ్రీకర్ రెడ్డి ఐదో పుట్టినరోజు వేడుకలను తల్లిదండ్రులు గోపాలకృష్ణ, జ్యోతి నిర్వహించారు. వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆరు నెలలు వచ్చేవరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.మంగాయమ్మ, పివిఎస్.లక్ష్మి, వి.శాంతి, ఎన్.అనంతకుమారి, డి.సుజాత, ఎ.వెంకటలక్ష్మి, ఎన్.వెంకటరత్నం, ఆశావర్కర్ ఎన్.సంతోషకుమారి పాల్గొన్నారు.


పెనుమంట్రలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి


బొండాడపేటలో టీకాలు వేస్తున్న సిబ్బంది

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - కాళ్ల

పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఎఎన్ఎం ఆర్.రత్నకుమారి అన్నారు. బొండాడపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల రోగ నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పిల్లలు 12 రకాల వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు బిడ్డ పుట్టినప్పటి నుంచి 16 సంవత్సరాలు వచ్చే వరకు ఈ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ చెన్ను సుజాత, వైద్య సిబ్బంది కె.చిట్టి, ఆశావర్కర్లు లక్ష్మి, ఎస్.మాణిక్యం పాల్గొన్నారు.

తోలేరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని తోలేరులో టిడిపి మహిళా విభాగం మహాశక్తి కార్యక్రమాన్ని శనివారం తోలేరులో నిర్వహించారు. ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహానాడులో చంద్రబాబు ప్రకటించిన పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, గ్రామాధ్యక్షుడు అడబాల వెంకట్రావు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు రొంగల కృష్ణవేణి పాల్గొన్నారు.

చంద్రబాబుపై రౌడీషీట్ తెరవాలి : వైసిపి

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్రంలో హింసను ప్రేరేపించి అరాచకాలు సృష్టిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై రౌడీషీట్ తెరవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీగౌడ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024లో టిడిపి ఘోర పరాభవాన్ని మూటకట్టుకుంటుందనే విషయాన్ని గ్రహించిన చంద్రబాబు ప్రాజెక్టులపై యుద్ధ భేరి అనే నినాదంతో రాయలసీమలో అరాచకాలను సృష్టించేందుకు చూస్తున్నారన్నారు. చిత్తూరు జిల్లాలో ఇప్పటివరకు చంద్రబాబుపై పైచేయి సాధించిన పెద్దిరెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఇటువంటి అరాచకాలు సృష్టించి రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వెంటనే రౌడీషీట్ తెరవాలన్నారు.


మొగల్తూరులో...

పలుచోట్ల 'పొలంబడి'

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులు పండించిన పంటను ఇ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఎడిఎ అనిల్‌కుమారి సూచించారు. శేరేపాలెం పంచాయతీ నవుడూరు గరువులో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇ క్రాప్ నమోదుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వరి పంటే కాకుండా రైతు పండించే అన్ని పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. ఇ క్రాప్ నమోదు కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పంటనష్టం, వడ్డీ రాయితీ, తదితర ప్రయోజనాలు పొందవచ్చన్నారు. రైతులు ఎరువులు, పురుగుమందులు విరివిగా వినియోగంచవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ అబ్దుల్ రహీమ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని వడలి గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పి.స్పందన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. యాజమాన్య పద్ధతుల ద్వారా దశలవారీగా పురుగుమందులను వాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాసాని విజయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు గణేష్‌రావు, విఆర్ఒ నరసింహమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా సైన్స్ సదస్సు

పాలకొల్లు : సైన్స్ చక్రవర్తిగా పేరుగాంచిన డాక్టర్ సివి.సర్వేశ్వరశర్మ శనివారం పాలకొల్లు ఆదిత్య స్కూల్లో నిర్వహించిన సైన్స్ సదస్సులో పాల్గొన్నారు. సైన్స్‌లోని వివిధ అంశాలను వివరిస్తూ పాఠశాలలోని విద్యార్థులకు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంపొందించారు. 1984లో కోనసీమ సైన్స్ పరిషత్ స్థాపించిన శర్మ సైన్స్‌కు సంబంధించిన వివిధ ప్రశ్నలను సంధిస్తూ, విద్యార్థుల నుంచి సమాధానాలను రాబడుతూ, విద్యార్థులకు సైన్స్‌లో ఉన్న గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ శర్మ వంటి మేధావులు రిటైర్‌మెంట్ తరువాత వివిధ ప్రాంతాలకు వచ్చి విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన మరింత పెంపొందించడం అభినందనీయమన్నారు. 81 ఏళ్ల వయస్సులో కూడా సమాజానికి శర్మ చేస్తున్న సేవలను కొనియాడారు. స్కూల్ ప్రిన్సిపల్ అయ్యప్పరాజు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంశీకి పలువురి అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్స్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష ద్వారా ఢిల్లీ కళాశాలలో నాలుగేళ్ల విద్య, శిక్షణకు ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ పూర్వ విద్యార్థి వంశీ ఎంపికయ్యారని స్కూల్ డైరెక్టర్ మద్దాల వాసు తెలిపారు. ఈ సందర్భంగా వంశీని వారధి వినయ్ అభినందించారు. కోర్సు గురించి వివరించారు. ఐఐఎఇ ఢిల్లీలో ప్రతి సంవత్సరం 60 మందిని ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేసి శిక్షణతో కూడిన విద్యను అందిస్తారని, ఇందుకోసం వేలాది మంది పరీక్షకు హాజరవుతారని, అందులో ప్రతిభతో సీటు సాధించినట్లు తెలిపారు. స్కూల్ డైరెక్టర్ మద్దాల వాసు మాట్లాడుతూ హైస్కూల్ స్థాయి నుంచి పోటీ పరీక్షల్లో ఇస్తున్న శిక్షణ వల్ల అధిక సంఖ్యలో విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్నారన్నారు. ప్రిన్సిపల్ వసంతలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి వంశీ క్రమశిక్షణతో చదివి తన లక్ష్యాన్ని అందుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటి ఫౌండేషన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వేగేశ్న అరుణ, ఉపాధ్యాయులు, విదార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

న్యాయవాదుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఉభయగోదావరి జిల్లాల కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఐలు జిల్లా కమిటీ సమావేశం తణుకు బార్ అసోసియేషన్ హాలులో మేకా ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, దేశంలోనూ న్యాయవాదులపై దాడులు, హత్యలు జరుగుతున్నయన్నారు. న్యాయవాదులకు వృత్తిలో రక్షణ లేకపోవడంతో న్యాయవాది వృత్తి అంటే భయపడుతున్నారన్నారు. ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కామన్ సివిల్ కోడ్‌ను అమలు చేయాలని ఉత్సాహం చూపుతుందన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తీసుకొని వారికి నమ్మకం కల్గించినప్పుడే అమలు చేయాలన్నారు. న్యాయవాది వృత్తిలోకి వచ్చేవారికి ఐదేళ్ల వరకు ప్రభుత్వం ఉపకార వేతనం ఇవ్వాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కవురు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీల్లో గుంటూరులో నిర్వహించే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. అన్ని బార్ అసోసియేషన్స్‌లో న్యాయవాదులకు, కక్షిదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జి.విజయభాస్కర్, పి.వేణుగోపాల చౌదరి, ఎం.రామారావు, పివిపి.లక్ష్మి, పి.నగేష్, ఎ.శ్రీనివాసరావు, పి.లతాకుమారి, పి.పెద్దిరాజు, యడ్లపల్లి మణికంఠ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ వంతెన నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న పార్కు, బస్టాండ్‌ను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న ఫుట్ పాత్ వంతెన పనులను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పురపాలక సంఘం అధికారులతో కలిసి శనవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, సుందరంగా వంతెనను తీర్చిదిద్దాలన్నారు. పార్కుకు సందర్శకులు పెరుగుతున్నారని, వారికి ఆహ్లాదకరంగా, అనువైన వాతావరణం కల్పించాలని చెప్పారు. ఆయనతో పాటు వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, దొంగ మురళీకృష్ణ, చాగంటి సత్యనారాయణ, మైలాబత్తుల శ్రీను, డిఇఇ ఆర్.రమేష్‌బాబు, ఎఇఇ మణి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ప్రసాదరాజు

రేపటివరకే 'ఎఎస్ఎన్ఎం'లో అడ్మిషన్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల ఐదో నుంచి ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ నెల ఏడో తేదీతో ప్రక్రియ పూర్తవుతుందని, ఆరో తేదీ ఆదివారం కూడా కాలేజీ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

నులి పురుగుల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల పదో తేదీన నిర్వహించే నులి పురుగుల నివారణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పూర్తిగా భాగస్వాములు కావాలని ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో నులి పురుగుల నివారణపై ఎంపిడిఒ పూర్ణ బాబ్జి ఆధ్వర్యంలో మండల పరిధిలోని స్కూల్ ప్రధానోపాధ్యాయులకు, వైద్య సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒకటి నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలను సగం ఇవ్వాలన్నారు. దాటిన వారికి ఒక మాత్ర ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో విద్యార్థులక, హాస్టల్స్‌లలో ఉన్నవారికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర వైద్యురాలు కె.లావణ్య, వై.అనూష, ఆలమూరు వైద్యులు వి.అనిల్‌కుమార్, మార్టేరు వైద్యులు కె.కార్తీక్, కె.చీవీర్, ఆయా భాషల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండి : ఈ నెల పదో తేదీన మండలవ్యాప్తంగా నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉండి ఎంపిపి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు పిలుపునిచ్చారు. ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి.సాయిచంద్ర అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో శ్రీహరి నారాయణరాజు మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించేలా చూడాలని ఎఎన్ఎంలకు ఆయన సూచించారు. నులి పురుగుల నివారణ ద్వారా రక్తహీనత సమస్యను తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి ఆర్.కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : ఈ నెల పదో తేదీన ప్రభుత్వం తలపెట్టిన జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక మండల పరిషత్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి మాట్లాడుతూ మండలంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రయివేట్ పాఠశాల విద్యార్థులకు నివారణ మాత్రలు అందించాలని చెప్పారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా మాత్రలు అందించాలని సూచించారు. విద్యార్థులతో మాత్రలు మింగించడం వల్ల రక్తహీనత నివారించవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో గణపవరం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, కె.ప్రియాంక, ఎంఇఒ పి.శేషు, సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.